నాడు వైభవం.. నేడు దుర్భరం

- శిథిలావస్థలో ఆయుర్వేద వైద్యశాల
- రోగులకు అందని వైద్యసేవలు
- వేధిస్తున్న సిబ్బంది కొరత
- వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో నూతన భవన నిర్మాణం
- పూర్తిచేయని కూటమి ప్రభుత్వం


నిరుపయోగంగా మారిన పదిపడకల ప్రభుత్వ ఆయుర్వేద వైద్యశాల


అసంపూర్తిగా నిలిచిపోయిన ప్రభుత్వ ఆయుర్వేద వైద్యశాల నూతన భవనం

బనగానపల్లె : బనగానపల్లె సమీపంలోని స్వామి హంసానందసర్వసతి ఆశ్రమంలో ఉన్న పదిపడకల ఆయుర్వేద ప్రభుత్వ వైద్యశాల శిథిలావస్థకు చేరి చాల కాలంగా నిరుపయోగంగా ఉంది. ప్రస్తుతం ఆసుపత్రి పక్కభాగంలో శిథిలమైన ఓ గదిలో వైద్యాధికారి విధులు నిర్వస్తున్నారు. ఆసుపత్రిలో 16 పోస్టులు ఉండగా సీనియర్ మెడికల్ ఆఫీసర్, స్వీపర్ పోస్టులు తప్పా మిగతా పోస్టులన్నీ ఖాళీగా ఉన్నాయి. ఇక్కడ స్వీపర్‌తో పాటు వైద్యాధికారి మాత్రమే విధులు నిర్వహిస్తున్నారు.

రాయలసీమలోనే అతిపెద్ద ఆయుర్వేద ఆసుపత్రి

1981లో రాయలసీమలోనే అతిపెద్ద పది పడకల ఏకైక ఆయుర్వేద వైద్యశాలను బనగానపల్లెలో ఏర్పాటు చేయించారు. అప్పట్లో రాయలసీమలో ఎక్కడాలేని విధంగా ఇక్కడ ఆసుపత్రిని ఏర్పాటు చేయడంతో ఆసుపత్రిలో పదిపడకల ఇన్‌పేషెంట్ వార్డుతో పాటు రోగులకు స్టీంబాతు, మసాజ్ యూనిట్‌ను ఏర్పాటు చేయడంతో మంచి ఆదరణ లభించింది. ప్రతి రోజు అప్పట్లో 250–300 వరకు అవుట్ పేషెంట్లు వచ్చేవారు. చర్మవ్యాధులు, స్త్రీలకు సంబంధించిన అన్ని రకాల వ్యాధులు, కీళ్ల నొప్పులు, నరాల బలహీనత, శ్వాసకోశవ్యాధులు, కీడ్నిలకు సంబంధించిన వ్యాధులకు ఇక్కడ మంచి వైద్య సౌకర్యం లభించేది. అలోపతి వైద్యం ద్వారా బాగుపడని జబ్బులు కూడా ఇక్కడి వైద్యులు బాగుచేసేవారు. అందువల్ల తెలంగాణ, కర్ణాటకతో పాటు సూదురప్రాంతాల నుంచి కూడా రోగులు వైద్యం కోసం ఇక్కడికి వచ్చేవారు.

ప్రభుత్వ నిర్లక్ష్యం..

కాలక్రమేణ ప్రభుత్వ ఆదరణ లభించక ఆయుర్వేద ఆసుపత్రి భవనం శిథిలావస్థకు చేరి, ఇక్కడి అన్ని యూనిట్లు నిరుపయోగంగా మారాయి. ఇన్‌పేషేంట్ వార్డు కూడా మూతపడింది. ఇక్కడ పని చేయు సిబ్బంది కూడా బదిలీపై వెళ్లడం, ఇతర కారణాల వల్ల పోస్టులు ఖాళీ పడితే మళ్లీ నియమించలేదు.

ప్రతిపాదనలు బుట్టదాఖలు..

ఆసుపత్రి ప్రాంగణం సువీశాలంగా ఉన్నందున దశాబ్ద కాలక్రితం ఇక్కడ ఆయుర్వేద కళాశాల ఏర్పాటుతో పాటు నర్సరీ ఏర్పాటుకు ఆమోదం కోసం ప్రతిపాదనలు పంపారు. వీటి ఏర్పాటుకు నిధులు మంజూరు అవుతున్నట్లు కూడా సంబంధిత ఉన్నతాధికారులు తెలియజేయడం జరిగింది. ఇక్కడ అయుర్వేద నర్సరీని ఏర్పాటు చేస్తే ఇక్కడే మందులు తయారు చేసి, ఇతర ప్రాంతాలకు సరఫరా చేయాలని అప్పట్లో ఉన్నతాధికారులు భావించారు. కానీ పంపిన ప్రతిపాదనలకు ఇంత వరకు చలనంలేదు. ఆసుపత్రి ప్రాంగణం అంతా పిచ్చిమొక్కలతో నిండిపోయింది.

మొక్కబడిగా వైద్యసేవలు

ఆసుపత్రి భవనం నిరుపయోగంగా మారడంతో పాటు చిన్న చిన్న జబ్బులకు కేవలం 3–4 రకాల మందులు మాత్రమే ఇక్కడ అందుబాటులో ఉన్నాయి. ఈ మందులను ఇక్కడ పని చేయు వైద్యాధికారి తనవద్ద ఉంచుకొని ఇక్కడికి వచ్చే కొద్దిపాటి మంది రోగులకు మొక్కుబడిగా ఇస్తుండడం పట్ల రోగులు ఆవేదన చెందుతున్నారు. గత వైభవం నేడు ఎక్కడ అంటూ ఇక్కడికి వచ్చే వారు ప్రశ్నిస్తున్నారు. ఇప్పటికైన సంబంధిత ఉన్నతాధికారులు చర్యలు తీసుకొని ఆసుపత్రికి పూర్వవైభవం తీసుకురావాలని ఇక్కడి ప్రజలు కోరుతున్నారు.

వైఎస్సార్‌సీపీ హయాంలో నూతన ఆసుపత్రి భవనం

2023లో వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో అప్పటి ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డి నూతన ఆయుర్వేద వైద్యశాల ఏర్పాటుకు సుమారు రూ.56లక్షల నిధులు మంజూరు చేయించి శంకుస్థాపన చేశారు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో నిర్మాణ పనులు చేపట్టగా ఎన్నికల నాటికి నిర్మాణ పనులు దాదాపుగా పూర్తయ్యాయి. కేవలం ఆసుపత్రి భవనానికి చెందిన కిటికీలు, సీలింగ్ ఫ్యాన్ల ఏర్పాట్లు మాత్రమే మిగిలిపోయాయి. ఆ పనులు పూర్తి చేసేందుకు కూటమి ప్రభుత్వంలో సంబంధిత అధికారులు రూ.13లక్షలతో పంపిన ప్రతిపాదనలకు చలనం లేక నిర్మాణ పనులు పూర్తికాలేదు. నిధులు మంజూరుకాగానే నిర్మాణ పనులు పూర్తిచేస్తామని సంబంధిత అధికారులు పేర్కొంటున్నారు.

వైద్యం అందిస్తున్నాం



ఇక్కడికి వచ్చే రోగులకు ఉన్న వరకు ఆయుర్వేద మందులను పంపిణీ చేస్తున్నాం. ప్రస్తుతం ఉన్న ఆసుపత్రి భవనం పతనావస్థకు చేరి నిరుపయోగంగా మారింది. సిబ్బంది కొరత ఎక్కువగా ఉంది. నిర్మాణంలో ఉన్న నూతన భవనం అందుబాటులోకి రాగానే రోగులకు పూర్తిస్థాయిలో వైద్య సౌకర్యం కల్పించేందుకు అవకాశం ఉంటుంది.

– టీ వాణి, సీనియర్ మెడికల్ ఆఫీసర్, ఆయుర్వేదవైద్యశాల బనగానపల్లె

క్లుప్తంగా

ఓజోన్ పొరను రక్షిద్దాం


బేతంచెర్లలో విద్యార్థుల ర్యాలీ

బేతంచెర్ల: జీవరాశి మనుగడకు ఆధారమైన ఓజోన్ పొర సంరక్షణకు అందరూ కృషి చేయాలని జెడ్పీ హైస్కూలు హెచ్‌ఎం హరికృష్ణ అన్నారు. మంగళవారం పట్టణంలోని మెయిన్ జెడ్పీ హైస్కూల్లో ఓజోన్ పరిరక్షణ దినోత్సవం సందర్భంగా విద్యార్థులకు వ్యాస రచన, చిత్ర లేఖనం పోటీలు నిర్వహించారు. అనంతరం గ్రామంలో ర్యాలీ చేపట్టారు. ఓజోన్ పొర దెబ్బతింటే కలిగే దుష్పరిణామాలపై విద్యార్థులకు అవగాహన కల్పించారు.

18న డోన్‌లో ఉచిత వైద్యశిబిరం

డోన్: ఈ నెల 17 నుంచి అక్టోబర్ 2వ తేదీ వరకు నిర్వహిస్తున్న స్వస్థ్ నారీ, సశక్త్ పరివార్ అభియాన్ కార్యక్రమంలో భాగంగా మహిళలకు ప్రత్యేక స్క్రీనింగ్ టెస్టులు నిర్వహిస్తామని ప్రభుత్వాసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ హనీఫ్ తెలిపారు. స్థానిక వంద పడకల ప్రభుత్వాసుపత్రిలో మంగళవారం ఆయన మాట్లాడుతూ ఈ నెల 18న రక్తపోటు, మధుమేహం, నోటి క్యాన్సర్, రొమ్ము క్యాన్సర్, గర్భాశయ క్యాన్సర్, క్షయవ్యాధి, కిశోర బాలికలకు వైద్యపరీక్షలు, మానసిక వైద్యసేవలు, వయోవృద్ధుల ఆరోగ్య పరీక్షలు, తల్లి, బిడ్డలకు వైద్యసేవలు అందిస్తామని చెప్పారు. వైద్యశిబిరాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

19న మెగా ఆరోగ్య శిబిరం

డోన్ టౌన్ : స్వస్థ్ నారీ, సశక్త్ పరివార్ అభియాన్ పథకం కింద ఈ నెల 19వ తేదీన రైల్వే స్టేషన్ రోడ్డులోని ప్రభుత్వ ఆయుర్వేద వైద్యశాలలో మహిళలు,కిశోర బాలికలకు ప్రత్యేక వైద్య శిబిరం నిర్వహించి ఉచిత మందులు అందజేస్తామని వైద్యురాలు గ్రేస్ సెలిస్టియల్ మంగళవారం తెలిపారు. స్థానిక ఆసుపత్రిలో వైద్య శిబిరానికి సంబంధించిన పోస్టర్లను విడుదల చేశారు.

పరామర్శ


సిద్ధారెడ్డి కుటుంబాన్ని పరామర్శిస్తున్న బుగ్గన అర్జున్

డోన్: ఇటీవల మృతిచెందిన వైఎస్సార్‌సీపీ యువజన నాయకుడు సిద్ధారెడ్డి కుటుంబాన్ని ఆ పార్టీ నాయకుడు, మాజీ ఆర్థిక మంత్రి తనయుడు బుగ్గన అర్జున్ అమర్నాథ్‌రెడ్డి మంగళవారం పరామర్శించారు. కుటుంబానికి పార్టీతో పాటు తమ కుటుంబం అండగా ఉంటుందని ధైర్యం చెప్పారు. అనంతరం ఆర్యవైశ్య సంఘం మాజీ అధ్యక్షుడు జొన్నలగడ్డ ప్రసాద్‌ను పరామర్శించి యోగక్షేమాలను తెలుసుకున్నారు. చివరగా..స్థానిక దుర్గా మల్లేశ్వరి ఆలయంలో పూజలు నిర్వహించారు.

తైక్వాండో పోటీల్లో చిన్నారుల ప్రతిభ


పతకాలు సాధించిన విద్యార్థులు

బేతంచెర్ల: విశాఖపట్నంలోని శిల్పారామంలో ఈనెల 13,14 తేదీల్లో జరిగిన 9వ రాష్ట్ర తైక్వాండో చాంపియన్ షిప్ పోటీలలో పట్టణానికి చెందిన చిన్నారులు ప్రతిభ చూపారు. పోటీలలో 200 మంది విద్యార్థులు పాల్గొనగా బేతంచెర్లకు చెందిన దివ్యశ్రీ, ప్రశాంత్ వల్లి, సహస్ర, ముజమ్మిల్, వినూక్ బంగారు పతకాలు, యశ్వంత్ రజత పతకం సాధించారు. విద్యార్థులను తల్లిదండ్రులు, మాస్టర్ వెంకటేష్, కోచ్ నాగన్న మంగళవారం అభినందించారు.

రోడ్డు ప్రమాదంలో గాయపడిన వ్యక్తి మృతి

కోవెలకుంట్ల: కోవెలకుంట్ల– నంద్యాల ఆర్అండ్‌బీ రహదారిలో సోమవారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో గాయపడిన వ్యక్తి మృతి చెందాడు. మంగళవారం ఎస్ఐ మల్లికార్జునరెడ్డి తెలిపిన వివరాల మేరకు.. దొర్నిపాడు మండలం గుండుపాపలకు చెందిన సైమన్ అలియాస్ చెన్నయ్య(37) సంజామల మండలం ఆర్. లింగందిన్నెలో బంధువుల పెద్దకర్మ కార్యక్రమాన్ని ముగించుకుని బైక్‌పై స్వగ్రామానికి బయలుదేరాడు. మండలంలోని జోళదరాశి ములుపువద్ద ఎదురుగా వస్తున్న గుర్తు తెలియని వాహనం ఢీకొనడంతో తలకు బలమైన గాయాలయ్యాయి. క్షతగాత్రుడికి స్థానిక ప్రభుత్వ ఆసుపత్రిలో ప్రాథమిక చికిత్స అనంతరం మెరుగైన వైద్యం కోసం నంద్యాలకు తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ కోలుకోలేక మృతి చెందినట్లు ఎస్ఐ తెలిపారు. మృతుని భార్య రాణి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు వెల్లడించారు.

రవాణశాఖ అధికారుల తనిఖీలు

కొలిమిగుండ్ల: నంద్యాల రవాణ శాఖ అధికారులు మంగళవారం కొలిమిగుండ్లలో పలు చోట్ల వాహనాల తనిఖీలు చేపట్టారు. ఓవర్‌లోడ్, రికార్డులు లేని రెండు ట్రాక్టర్లు, రెండు టిప్పర్లపై కేసు నమోదు చేసి, పట్టుబడిన వాహనాలను స్థానిక పోలీస్ స్టేషన్‌కు అప్పగించారు. అధికారులు తనిఖీలు చేస్తున్న విషయం తెలుసుకున్న వాహనాల యజమానులు అప్రమత్తం అయ్యారు. వాహనాలను ఎక్కడిక్కడే నిలుపుకున్నారు. అధికారులు వెళ్లిపోయారని నిర్ధారించుకున్నాక రవాణ సాగించారు.

ఐటీఐలో 4వ విడత ప్రవేశాలకు దరఖాస్తు

డోన్ టౌన్ : జిల్లాలోని ప్రభుత్వ,ప్రైవేట్ ఐటీఐల్లో మిగిలిపోయిన సీట్ల భర్తీ కోసం ఈ నెల 16 నుంచి 27వ తేదీ వరకు 4వ విడత ప్రవేశాలకు దరఖాస్తు చేసుకోవాలని జిల్లా కన్వీనర్, డోన్ ప్రభుత్వ ఐటీఐ ప్రిన్సిపాల్ ప్రసాదొరెడ్డి మంగళవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఆసక్తి కల్గిన అభ్యర్థులు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకొని 28వ తేదీ లోపు సమీప ప్రభుత్వ ఐటీఐలో ఒరిజినల్ సర్టిఫికెట్లను వెరిఫికేషన్ చేయించుకోవాలని సూచించారు. 29న ఉదయం 9 గంటల నుంచి ప్రభుత్వ ఐటీఐల్లో, 30న ప్రైవేట్ ఐటీఐల్లో జరిగే కౌన్సెలింగ్‌కు హాజరుకావాలని కోరారు.వివరాలకు సమీప ప్రభుత్వ ఐటీఐల్లో సంప్రదించాలన్నారు.

పశువులకు టీకాలు వేయించాలి

డోన్: గాలికుంటు వ్యాధి నివారణ కు పశుపోషకులు తమ పశువులకు టీకాలు వేయించాలని పశుసంవర్ధక శాఖ సంయుక్త సంచాలకులు డాక్టర్ నాగరాజు తెలిపారు. స్థానిక పశువైద్యశాలలో జాతీయ పశువ్యాధి నియంత్రణ పథకం కింద వచ్చే నెల 15వ తేదీ వరకు ఉచితంగా పశువులకు గాలికుంటు వ్యాధి టీకాలు వేస్తామని చెప్పారు. రైతులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

20న పాస్టర్ల సమావేశం

డోన్: ఈనెల 20వ తేదీన స్థానిక లక్ష్మీ ఫంక్షన్ హాల్‌లో రాయలసీమ బైబిల్‌మిషన్ ఆధ్వర్యంలో పాస్టర్ల సమావేశం నిర్వహిస్తున్నట్లు బైబిల్ మిషన్ ఏపీ రెవరెండ్ బండెల రాజు మంగళవారం తెలిపారు. కార్యక్రమానికి సంబంధించిన పోస్టర్లను తన కార్యాలయంలో పాస్టర్లతో కలిసి ఆవిష్కరించారు. పాస్టర్లు సాల్మన్, దేవదాస్, రాజ్‌కుమార్, మాణిక్యం రెడ్డి పాల్గొన్నారు.

శరన్నవరాత్రి ఉత్సవాలకు ఆహ్వానం


బుగ్గన అర్జున్‌ను ఆహ్వానిస్తున్న ఆర్యవైశ్య సంఘం నాయకులు

డోన్: స్థానిక కన్యకాపరమేశ్వరి అమ్మవారి ఆలయంలో ఈనెల 22వ తేదీ నుంచి ప్రారంభమయ్యే దసరా శరన్నవరాత్రి ఉత్సవాల్లో పాల్గొనాలని రాష్ట్ర ఆర్థిక శాఖ మాజీ మంత్రి బుగ్గన రాజేంద్రనాథ్‌రెడ్డి తనయుడు బుగ్గన అర్జున్ అమర్నాథ్‌రెడ్డికి మంగళవారం ఆర్యవైశ్య సంఘం అధ్యక్షుడు, మున్సిపల్ వైస్ చైర్మన్ కోట్రికె హరికిషన్ సంఘం నాయకులతో కలిసి ఆహ్వాన పత్రం అందజేశారు. కుటుంబ సమేతంగా పాల్గొనాలని సంఘం నాయకులు కొట్రా రజినీ, కామిశెట్టి సాగర్, ప్రదీప్, ఆల్వాల సురేష్, లోకేష్, వైఎస్సార్‌సీపీ రాష్ట్ర వాణిజ్య విభాగం సహాయ కార్యదర్శి పాలుట్ల రఘురాం, పట్టణ విభాగం అధ్యక్షుడు మేడా రఘు ఆహ్వానించారు.

కుక్కలు బాబోయ్..!

కోవెలకుంట్ల: స్థానిక మేజర్ గ్రామ పంచాయతీ పరిధిలో ప్రజలను కుక్కల బెడద వెంటాడుతోంది. గాంధీనగర్, అయ్యప్పస్వామి దేవాలయ వీధి, ఎల్ఎం కాంపౌండ్, స్వామినగర్, గుద్దెటి వీధి, సభాపతిరోడ్, గాంధీసెంటర్, సంతపేట, తదితర ప్రాంతాల్లో శునకాలు గుంపులు గుంపులుగా సంచరిస్తున్నాయి. ఆయా ప్రాంతాల్లో వెళ్లే పాదచారులు, ద్విచక్ర వాహన చోదకులను వెంబడిస్తున్నాయి. దీంతో వాహన చోదకులు భయపడి కింద పడి గాయాలపాలవుతున్నారు. చిన్నపిల్లలు, మహిళలు కుక్కల వల్ల రోడ్లపైకి రావాలంటేనే భయపడుతున్నారు. ఇటీవల పట్టణంలోని ఆయా కాలనీల్లో కుక్కలు వెంటపడి ప్రజలను కాటువేసిన సంఘటనలున్నాయి. సంబంధిత అధికారులు చర్యలు తీసుకుని కుక్కల బారి నుంచి ప్రజలను కాపాడాలని కోరుతున్నారు.


కోవెలకుంట్లలోని అంకాలమ్మ చౌరస్తాలో గుంపులుగా సంచరిస్తున్న కుక్కలు

ఎరువుల దుకాణాల్లో తనిఖీలు

రుద్రవరం: మండల పరిధిలోని ఆలమూరులో ఉన్న ఎరువుల దుకాణాలపై మంగళవారం విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ ఏఓ విశ్వనాథ్, స్థానిక వ్యవసాయాధికారి సుమతి కలిసి దాడులు నిర్వహించారు. రసాయన ఎరువులు, పురుగు మందులు అధిక ధరలకు విక్రయిస్తున్నట్లు సమాచారం అందడంతో ఈ దాడులు చేసినట్లు వారు తెలిపారు. ఇందులో భాగంగా గ్రామంలోని మూడు దుకాణాల్లో తనిఖీలు చేసి రూ.298834 విలువ చేసే14.335 టన్నుల యూరియా, డీఏపీని సీజ్ చేసి 6ఏ కింద కేసు నమోదు చేసినట్లు వారు తెలిపారు.



ఆలమూరులో రసాయన ఎరువుల బస్తాలను పరిశీలిస్తున్న అధికారులు

అనుమానాస్పద స్థితిలో వృద్ధురాలి మృతి

ఉయ్యాలవాడ : మండల కేంద్రం ఉయ్యాలవాడలో అనుమానాస్పద స్థితిలో ఓ వృద్ధురాలు మృతి చెందిన సంఘటన మంగళవారం వెలుగు చూసింది. ఎస్ఐ రామిరెడ్డి తెలిపిన వివరాల మేరకు.. గ్రామానికి చెందిన రామక్కగారి సుశీలమ్మ(65) సోమవారం రాత్రి మృతి చెందినట్లు పేర్కొన్నారు. ఈమెకు ఒక కుమారుడు, ఒక కుమార్తె ఉన్నారు. ఇద్దరికి వివాహమైంది. ఈమె భర్త చిన్న సుబ్బారెడ్డి సుమారు 15 సంవత్సరాల క్రితం మృతి చెందాడు. కుమారుడు వెంకట సుబ్బారెడ్డి చెన్నైలో ఒక ప్రైవేట్ కంపెనీలో ఉద్యోగం చేస్తున్నాడు. రెండు రోజులుగా సుశీలమ్మ ఇంటి తలుపు తీయకపోవడంతో చుట్టు పక్కల ఉన్న వారికి అనుమానం వచ్చి పోలీసులకు సమాచారం అందజేశారు. ఎస్ఐ రామిరెడ్డి ఇంటి వద్దకు వెళ్లి పరిశీలించగా మంచంపై విగత జీవిగా పడి వుంది. ముక్కు, చెవులలో నుంచి రక్తం కారిన ఆనవాళ్లు కనిపించాయి. ఈ విషయాన్ని కుమారుడు, కుమార్తెకు తెలియజేయగా తమ తల్లి మృతిపై విచారణ చేపట్టాలని ఫిర్యాదు చేశారు. దీంతో కేసు నమోదు చేసుకుని సుశీలమ్మ మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం మంగళవారం ఆళ్లగడ్డ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించినట్లు ఎస్ఐ స్పష్టం చేశారు.

అ'పూర్వ' సమ్మేళనం

డోన్: పట్టణ శివారులోని బేతంచెర్ల రోడ్డు పక్కన నిర్మించిన నగరవనంలో 1990–91 బ్యాచ్ పూర్వ విద్యార్థులు మంగళవారం కలుసుకున్నారు. ఈ సందర్భంగా నాటి స్మృతులను గుర్తు చేసుకొని ఉల్లాసంగా గడిపారు.


నగరవనంలో కలుసుకున్న పూర్వ విద్యార్థులు

మూట్ కోర్ట్ ఫలితాల్లో ఉత్తమ ప్రతిభ

డోన్ టౌన్ : జాతీయ స్థాయిలో నిర్వహించిన మూట్ కోర్ట్ ఫలితాల్లో డోన్‌కు చెందిన సీనియర్ న్యాయవాది, వైఎస్సార్‌సీపీ నాయకుడుఎస్.నరసింహుడు,లావణ్య దంపతుల కుమార్తె ఎస్.సాహితి ఆల్ ఇండియా రన్నరప్‌గా నిలిచి అవార్డుతో పాటు నగదు బహుమతి అందుకున్నారు. తిరుపతిలోని అంబేడ్కర్ గ్లోబల్ న్యాయ కళాశాలలో లా కోర్సులో 4వ సంవత్సరం చదువుతున్న సాహితి మూట్ కోర్ట్ పరీక్షలకు 110 విశ్వ విద్యాలయాల విద్యార్థినులతో పోటీ పడి ఉత్తమ ప్రతిభ చూపినందుకు ఈ నెల 15న గుజరాత్‌లోని పరుల్ యూనివర్సిటీ ఏర్పాటు చేసిన సంవిధాన్ పే చర్చా 2025 కార్యక్రమంలో సాహితికి.. లా కమిషన్ ఆఫ్ ఇండియా చైర్‌పర్సన్ జస్టిస్ దినేష్ మహేశ్వరి, ఢిల్లీ హైకోర్టు న్యాయమూర్తి జ్యోతిసింగ్, మధ్యప్రదేశ్ హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ విజయ్‌కుమార్ అవార్డు అందజేశారు.


అవార్డు అందుకుంటున్న సాహితి

ఈ క్రాప్ నమోదు తప్పనిసరి

సంజామల: ఖరీఫ్‌లో పంటలు సాగు చేసిన రైతులు తప్పని సరిగా ఈ క్రాప్ నమోదు చేసుకోవాలని మండల వ్యవసాయ అధికారి భూమ జ్యోతి సూచించారు. మంగళవారం ఆమె మాట్లాడుతూ.. ఈక్రాప్ నమోదు చేసుకున్న రైతులకు మాత్రమే వ్యవసాయ శాఖ పథకాలకు అర్హత లభిస్తుందన్నారు. మండలంలో ఖరీఫ్ సీజన్ సాధారణ విస్తీర్ణం 15,861 ఎకరాలు ఉంటే ఇప్పటి వరకు 8,892 ఎకరాలలో మాత్రమే ఈ క్రాప్ నమోదు చేసుకున్నారని తెలిపారు.

ఈ పంట నమోదు చేసుకోవాలి

కోవెలకుంట్ల: వివిధ వ్యవసాయ పథకాలు, రాయితీలు, పంటనష్ట పరిహారం, పంటలబీమా వర్తింపునకు ఈ పంట నమోదు తప్పనిసరని మండల వ్యవసాయాధికారి సుధాకర్‌రెడ్డి అన్నారు. మంగళవారం మండలంలోని లింగాల, రేవనూరు గ్రామాల్లో పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. ఏఓ మాట్లాడుతూ 2025 ఖరీఫ్ సీజన్‌లో రైతులు సాగు చేసిన పంటల వివరాలను రైతు సేవా కేంద్రాల్లో నమోదు చేసుకోవాలన్నారు. విత్తనాలు మొదలుకుని, పంట ఉత్పత్తుల కొనుగోలు వరకు ఈ పంట నమోదు ప్రామాణికమన్నారు. కార్యక్రమంలో వ్యవసాయశాఖ అసిస్టెంట్ భాగ్యవతి, రైతులు పాల్గొన్నారు.

పెన్షనర్ల సంఘం సహ అధ్యక్షుడి మృతి


రామసుబ్బయ్య(ఫైల్)

బనగానపల్లె/బనగానపల్లె రూరల్ : బనగానపల్లె పట్టణంలోని మంగళవారంపేట కాలనీకి చెందిన వైఎస్సార్ సీపీ నాయకులు సూరకిశోర్ కుమార్ తండ్రి, బనగానపల్లె డివిజన్ పెన్షనర్ల సంఘం సహఅధ్యక్షుడు, రిటైర్డ్ ఉపాధ్యాయులు సూర రామసుబ్బయ్య(78) మంగళవారం అనారోగ్యంతో మృతి చెందారు. విషయం తెలుసుకున్న మాజీ ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డి కిశోర్‌కుమార్ ఇంటి వద్దకు వెళ్లి సూరరామ సుబ్బయ్య మృతదేహానికి పూలమాలవేసి నివాళులర్పించారు. వారి కుటుంబ సభ్యులను పరామర్శించారు. కార్యక్రమంలో అవుకు మండల వైఎస్సార్‌సీపీ కన్వీనర్ కాటసాని తిరుపాల్‌రెడ్డి, కాలనీకి చెందిన వైఎస్సార్‌సీపీ నాయకులు తదితరులు ఉన్నారు.

ఉత్తమ ఫలితాల సాధనకు కృషి చేయాలి

కొలిమిగుండ్ల: పదో తరగతి, ఇంటర్‌లో ఉత్తమ ఫలితాలు సాధించేందుకు ఉపాధ్యాయులు కృషి చేయాలని రాష్ట్ర అకడమిక్ మానిటరింగ్ ఆఫీసర్ కృష్ణవేణి సూచించారు. మంగళవారం అసిస్టెంట్ మానిటరింగ్ ఆఫీసర్ సలీంతో కలిసి స్థానిక మోడల్‌స్కూల్‌ను తనిఖీ చేశారు. పాఠశాలకు చెందిన వివిధ రికార్డులతో పాటు ఉపాధ్యాయుల పనితీరును పరిశీలించారు. విద్యార్థులకు అందించే మధ్యాహ్న భోజనం నాణ్యతగా ఉండేలా పర్యవేక్షించాలని ప్రిన్సిపాల్ సంజీవరెడ్డిని ఆదేశించారు.

పాఠశాలకు మైక్ సెట్ అందజేత

డోన్ టౌన్ : పట్టణానికి చెందిన వివేకానంద సేవా సమితి ఆధ్వర్యంలో మండలంలోని యు.కొత్తపల్లె ప్రాథమిక పాఠశాలకు రూ.17వేల విలువజేసే మైకు సెట్టు, ఆట వస్తువులను ఎంఈఓ ప్రభాకర్, సర్పంచ్ విద్య చేతుల మీదుగా మంగళవారం అందజేశారు. ఎంఈఓ మాట్లాడుతూ సమితి సామాజిక కార్యక్రమాలను అభినందించారు. సమితి వ్యవస్థాప అధ్యక్షులు జగన్‌మోహన్,ప్రధాన కార్యదర్శి జొన్నలగడ్డ శ్రీనివాసులు, దాత కొత్తపల్లె శ్రీనివాసులు,ఇన్నర్‌వీల్ క్లబ్ మాజీ అధ్యక్షురాలు మలిశెట్టి శారద పాల్గొన్నారు.

లేఔట్లను క్రమబద్ధీకరించుకోండి

బేతంచెర్ల: నగర పంచాయతీ పరిధిలో అనధికారికంగా వెలసిన 32 లేఔట్లను క్రమబద్ధీకరించుకోవాలని నగర పంచాయతీ కమిషనర్ హరిప్రసాద్ తెలిపారు. మంగళవారం స్థానిక నగర పంచాయతీ కార్యాలయంలో టౌన్ ప్లానింగ్ సెక్రటరీ నాగ సురేష్ ఆధ్వర్యంలో లేఔట్ల యజమానులకు ఎల్ఆర్ఎస్ స్కీంపై అవగాహన కల్పించారు. అక్టోబర్ 23 వరకు కల్పించిన అవకాశాన్ని వినియోగించుకోవాలని కోరారు.

మద్యం మత్తులో యువకుల వీరంగం


గ్రామంలో గొడవ పడుతున్న దృశ్యం

బేతంచెర్ల: మండలంలోని ఎం.పెండేకల్లు గ్రామంలో మంగళవారం ఉదయం మద్యం మత్తులో యువకులు వీరంగం సృష్టించారు. కొలుములపల్లెకు చెందిన ఓ యువకుడు 8 మంది యువకులతో కలిసి ఎం.పేండేకల్లు గ్రామానికి వచ్చి సమీప బంధువులైన ఎర్రమల భార్య లక్ష్మమ్మ, కొడుకులైన నాగమద్దయ్య, చిన్న నాగమద్దయ్యపై వ్యక్తిగత కక్షలను మనస్సులో పెట్టుకొని మద్యం మత్తులో వాగ్వాదానికి దిగడమే కాకుండా దాడి చేసి గాయపరిచారు. దీంతో గ్రామంలో ఉద్రిక్తత పరిస్థితి నెలకొంది. గ్రామస్తులు ఇరువర్గాలకు సర్ది చెప్పారు. బాధితులు పోలీసులకు ఫిర్యాదు చేశారు.

నివాళి

అవుకు(కొలిమిగుండ్ల): మండల పరిధిలోని చిన్న కొట్టాలకు చెందిన వైఎస్సార్‌సీపీ నాయకుడు ఏరాశి జనార్ధనరెడ్డి(60) మంగళవారం మృతి చెందారు. విషయం తెలుసుకున్న మాజీ ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డి, అవుకు మండల వైఎస్సార్‌సీపీ కన్వీనర్ కాటసాని తిరుపాల్‌రెడ్డి గ్రామానికి చేరుకొని మృతదేహం వద్ద నివాళులర్పించారు. కుటుంబ సభ్యులను పరామర్శించి సంతాపం తెలిపారు.


నివాళులర్పిస్తున్న మాజీ ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డి

20న యాగంటిలో శివపార్వతుల కల్యాణం

బనగానపల్లె రూరల్ : మండలంలోని యాగంటి క్షేత్రంలో వెలసిన శ్రీ ఉమామహేశ్వరస్వామి ఆలయంలో ఈ నెల 20న మాసశివరాత్రి సందర్భంగా శివపార్వతుల కల్యాణం వైభవంగా నిర్వహిస్తున్నట్లు ఆలయ ఈఓ పాండురంగారెడ్డి మంగళవారం తెలిపారు. ఇందులో భాగంగా ఉదయం ఆలయంలో ఏకశిలారూపంలో కొలువైన శ్రీ ఉమామహేశ్వరులకు ప్రత్యేక పూజలు, సాయంత్రం కల్యాణోత్సవం ఉంటుందని పేర్కొన్నారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని స్వామివారి కృపకుపాత్రులు కావాలన్నారు.

సీఐటీయూ మండల కమిటీ ఎన్నిక

ప్యాపిలి: సీఐటీయూ మండల నూతన కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. స్థానిక గ్రామ పంచాయతీ కార్యాలయంలో మంగళవారం నిర్వహించిన ఎన్నికకు సంఘం జిల్లా సహాయ కార్యదర్శి శివరాం, జిల్లా కమిటీ సభ్యుడు భాస్కర్ రెడ్డి హాజరయ్యారు. మండల అధ్యక్షుడిగా రామాంజనేయులు, ఉపాధ్యక్షులుగా రంగస్వామి, నెట్టికల్లు, ప్రధాన కార్యదర్శిగా చిన్న రహిమాన్, సహాయ కార్యదర్శులుగా పద్మశాలి శ్రీనివాసులు, రామనాయుడు, కోశాధికారిగా లక్ష్మణ్ తదితరులను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.

కొనసాగిన విద్యుత్ ఉద్యోగుల నిరసన

కోవెలకుంట్ల: తమ న్యాయమైన డిమాండ్లు నెరవేర్చాలని కోరుతూ విద్యుత్ ఉద్యోగులు చేపట్టిన నిరసన మంగళవారం కొనసాగింది. స్థానిక ట్రాన్స్‌కో కార్యాలయ ఉద్యోగులు ఏడీఈ సతీష్‌కుమార్‌రెడ్డి, ఏఈ రామమోహన్ ఆధ్వర్యంలో సిబ్బంది రెండవ రోజు నల్ల బ్యాడ్జీలు ధరించి విధులకు హాజరయ్యారు. వారు మాట్లాడుతూ విద్యుత్ ఉద్యోగులకు నగదు రహిత వైద్య అందించాలని, 1999 ఫిబ్రవరి 1 నుంచి 2004 ఆగస్టు 31 మధ్య చేరిన ఉద్యోగులకు పెన్షన్ సదుపాయం కల్పించాలన్నారు. దళారీ వ్యవస్థను రద్దు చేసి కార్మికులకు నేరుగా వేతనాలు అందజేయాలన్నారు.

బ్లాస్టింగ్‌తో పొలాల్లోకి రాళ్లు

కొలిమిగుండ్ల: పెట్నికోట సమీపంలో నిర్మాణంలో ఉన్న అల్ట్రాటెక్ సిమెంట్ కంపెనీకి చెందిన మైనింగ్‌లో భాగంలో బ్లాస్టింగ్ చేస్తుండటంతో రాళ్లు ఎగిరొచ్చి పంట పొలాల్లో పడుతున్నాయి. సిమెంట్ కంపెనీకి చెందిన మైనింగ్ ప్రాంతం చెంతనే గ్రామానికి చెందిన అన్నెం చంద్రశేఖరరెడ్డికి నాలుగు ఎకరాల పొలం ఉంది. అందులో ఇటీవల ఆముదం సాగు చేశాడు. బ్లాస్టింగ్ చేయడంతో రాళ్లు ఎగిరి వచ్చి పొలంలో పడుతున్నాయని రైతు తెలిపాడు. పొలంలో పనులు చేసేందుకు వెళ్లాలన్నా ఎక్కడ రాళ్లు మీద పడుతాయోనని భయాందోళన వ్యక్తం చేస్తున్నాడు. కంపెనీ ప్రతినిధుల దృష్టికి వెళ్లినా ఎలాంటి స్పందన లేదన్నారు. మైనింగ్‌కు పక్కనే పొలం ఉండటంతో విక్రయించాలని ఒత్తిడి చేస్తున్నట్లు వాపోయాడు. ఈవిషయంపై అధికారులు చర్యలు తీసుకోవాలని రైతు చంద్రశేఖరరెడ్డి కోరుతున్నాడు.

నివాళి

బేతంచెర్ల: పట్టణానికి చెందిన పారిశ్రామికవేత్త అనుముల స్వామి శెట్టి (70) అనారోగ్యంతో మంగళవారం మృతి చెందాడురు. విషయం తెలుసుకున్న ఎంపీపీ బుగ్గన నాగభూషణం రెడ్డి, వైస్ ఎంపీపీ రంగస్వామి, వైఎస్సార్‌సీపీ నాయకులు సలీం, సురేంద్ర, పట్టణ, మండల కన్వీనర్లు తిరుమలేశ్వర్‌రెడ్డి మృతదేహంపై పూలమాలలు వేసి నివాళులర్పించారు.

విజయవంతం చేయండి

డోన్ టౌన్ : పేదల కోసం జీవితాన్ని అంకితం చేసిన సీపీఐ జాతీయ మాజీ ప్రధాన కార్యదర్శి కామ్రేడ్ సురవరం సుధాకర్‌రెడ్డి సంస్మరణ సభను విజయవంతం చేయాలని ఆ పార్టీ జిల్లా కార్యదర్శి రంగనాయుడు పిలుపునిచ్చారు. స్థానిక నక్కి రామన్న భవన్‌లో మంగళవారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ 17వ తేదీన నంద్యాలలో, 19న డోన్ పట్టణంలోని షాదిఖానాలో సంస్మరణ సభలు ఏర్పాటు చేసినట్లు ఆయన తెలిపారు. జిల్లా కార్యవర్గ సభ్యుడు సుంకయ్య, మండల,పట్టణ కార్యదర్శులు నారాయణ,మోటా రాముడు ఉన్నారు.

గుండెపోటుతో రైల్వే ఎస్ఐ మృతి


మృతి చెందిన ఎస్ఐ లక్ష్మణ్‌నాయక్

డోన్ టౌన్ : స్థానిక రైల్వే స్టేషన్‌లో ఆర్‌పీఎఫ్ ఎస్ఐగా విధులు నిర్వహిస్తున్న లక్ష్మణ్‌నాయక్ (57) గుండె పోటుతో మృతి చెందారు. మంగళవారం గుంతకల్లు డీఆర్ఎం చంద్రశేఖర్ గుప్త డోన్ రైల్వే స్టేషన్‌లో జరుగుతున్న అమృత్ స్టేషన్ పథకం పనుల పరిశీలనకు వచ్చారు. విధులకు హాజరైన ఎస్ఐ.. డీఆర్ఎం పర్యటన ముగిసిన తరువాత స్టేషన్‌కు వెళ్లే క్రమంలో మెట్లను ఎక్కబోతూ అకస్మాత్తుగా కిందపడి పోవడాన్ని గమనించిన రైల్వే సిబ్బంది రైల్వే ఆసుపత్రికి తరలించారు. పరీక్షించిన వైద్యులు మృతి చెందినట్లు నిర్ధారించారని సిబ్బంది తెలిపారు.

ఓజోన్ పొరపై విద్యార్థులకు అవగాహన

నంద్యాల(న్యూటౌన్): ప్రపంచ ఓజోన్ పొర పరిరక్షణ దినాన్ని పురస్కరించుకుని మంగళవారం నంద్యాల పట్టణంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో విద్యార్థినీ విద్యార్థులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఇందులో ప్రిన్సిపాల్ డాక్టర్ శశికళ మాట్లాడుతూ ఓజోన్ పొరను కాపాడుకోకపోతే భవిష్యత్తులో తీవ్ర పరిణామాలు ఎదుర్కోవాల్సి వస్తుందన్నారు. అనంతరం విద్యార్థులకు ఆన్‌లైన్‌లో క్విజ్ నిర్వహించారు. కార్యక్రమంలో డాక్టర్ శ్రీహరి, అధ్యాపకులు శ్రీనివాసులు పాల్గొన్నారు.